


# అటు ఆకలి... ఇటు చీకటి

సోమసుందర్

ఇల్లు విడిచి వెళ్ళిపోవడమే మార్గమనిపించింది రంగనాథానికి. అవును మరి అంతకన్న ఏంచేస్తాడా పరిస్థితిలో ? ఊరు విడిచి ఎరిగిన వాళ్ళందరినీ విడిచిపెట్టి పొట్టచేత్తో పట్టుకొని వెళ్ళిపోవడం తప్ప వేరే శరణ్యం కనిపించలేదు వాడికి.

ఐతే ఎక్కడికని వెడతాడు? ఇంత విశాలలోకంలో వాడికి ఆశ్రయమిచ్చి ఆదరించే నా అన్నవాళ్ళెవరున్నారు?

ఎవరున్నారుమరి? సీతక్కయ్యా, రామ్మూర్తిబావా ఒక్కరే దూరంగా చిరుదీపంలా మెరుస్తున్నారు. విశాఖపట్నంలో సింధియా కంపెనీలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడు రామ్మూర్తిబావ! గౌరవంగానే బ్రతుకుతున్నాడు. అతనికి తనపట్ల ప్రేమాభిమానాలు ఉన్నాయి, ఆమధ్య వచ్చినప్పుడు తనపరిస్థితికి ఎంతోజాలి పడ్డాడు.

"కష్టపడి చదివి బియ్యే ప్యాసయిపో ముందు ! మా కంపెనీలో ఏదైనా ఉద్యోగం ప్రయత్నిద్దాం!" అని అన్నాడు.

ఆపత్సమయంలో అక్కాబావా జ్ఞాపకం రాకదారేముంది? అదేం కర్మమో? ఆ బి. ఏ. రెండక్షరాలూ తనపేరు వెనక తగిలించుకొనే యోగమే దూరమై పోతోంది! అదేలభిస్తేనా? తనకి గౌరవంవున్నా లేక పోయినా వాటికేనా గౌరవం లభించకిపోయేదా? కాని యిప్పుడు మంచున్న పళాన తనకో ఉద్యోగం సంపాదించి పెట్టగలడా బావ?! ఈ రోజుల్లో ఉద్యోగం అంటే మాటలా?

అంత అదృష్టమే తనమొగాన రాసివుంటే ఇంత అకస్మాత్తుగా ఇల్లు విడిచి బయల్దేరవలసిన అవసరమేముంది? నాన్నమాత్రం ఇంత ఛీత్కారం చేయవలసిన అవసరమేముంటుంది? ఇంతకీ అయన్ననుకొని

ఏంలాభం? దిక్కుమాలిన జిల్లాపరిషత్ స్కూలు మేష్టరీఉద్యోగంలో ఎంతకని తనమీద మదుపు పెట్టగలుగుతాడు?

అప్పటికే బి.ఏ. పరీక్షఫీజులకనీ, పరీక్షల ఖర్చులకనీ మూడు దఫాలనుంచీ యిస్తూనే ఉన్నాడాయె! ఎన్ని వందలు ఖర్చయ్యేయోపాపం నాన్నకి! మొదటి ఛాన్సులోనే లాంగ్వేజెస్ ప్యాసయినట్లుగా ఈ గ్రూపుకూడా ప్యాసయిపోకూడదూ? దేవుడు దయచూపని నిర్భాగ్యుడికి ఆ అదృష్టం ఎలా కలుగుతుంది?

పాపం మాల్లెందుకుగాని ఎంత సవతి తల్లైనా చిన్నమ్మకూడా తననీఅక్కయ్యనీ ఎంతో ప్రేమగాపెంచింది. సాధ్యమైనంత ఆప్యాయంగానే చూసేది. కాని తీరాతనకడుపున ఆ ఒక్కనలుసూ కలిగేసరికి ఆమె మనసు మారిపోయినట్లుంది! ఇంతకీ చిన్నమ్మననీలాభంలేదు.

ఏమనుకుంటే ఏం జరుగుతుందికనక! తనకీ ఇంటికీ యీవేళతో ఋణం తీరిపోయింది. అంత చిన్నచిలిపి విషయంమీద చిన్నమ్మ మహమ్మారిలా విరుచుకుపడుతూంటే అభమో శుభమో తెలుసుకోకుండా నాన్న గుమ్మంలోకడుగు పెడుతూనే చేతిలోని గుబ్బగొడుగుతో వీపు మీదబాదాలా? పశువును బాదినట్లు బాదడానికితనేంచిన్నాడా? చితకాడా పైగా "ఫోవెధవా చెడతింటున్నావింటపడి తల్లి అనే గౌరవం లేకుండా ఏమిటా గావు కేకలు?" అంటూ రంకెలు వేస్తాడా?

తనా కేకలు వేస్తూంటె తనా చెడ తింట్టూంటె...

ఏమైతేనేం కాని సమయం కాని సమయంలో ఇల్లువిడచి బయల్దేరవలసి వచ్చింది. బ్రతుకు వెదుక్కుంటూ పోవలసి వచ్చింది రంగనాధానికి...

జేబులు తడిమిచూసుకున్నాడు. ఏముంది? ఒక్కపదిపైసల బిళ్ళతగిలింది. నలిగిపోయిన సిగరెట్టూ ఒకటుంది. అవునూ చిన్నమ్మ కూరలు తెమ్మని యిచ్చిన డబ్బులేవీ? జ్ఞాపకం వచ్చింది. చొక్కా చేతి మడతల్లో దాచాడుకదూ! ఇంకేముంది తన దగ్గర! గుండెనిండా అవమానం వుంది. మెదడునిండా ఉక్రోషం వుంది.

అందుకే కారవలసిన కన్నీళ్ళుకారుతూనే వున్నాయి. దారి పొడుగునా కళ్ళాపుజల్లుతున్నాయి.

తిన్నగా సూరీడు మాష్టారింటికెళ్లాడు రంగనాథం. "మాష్టారూ! మాష్టారూ!" వేసివున్న వీధి గుమ్మనుంచే పిలిచాడు.

రావోయి రా! మీ మేష్టారు లోపల మొగం కడుక్కుంటున్నారు అన్నారు సుందరమ్మక్కయ్యగారు తలుపుతీస్తూ.... మేష్టారు రానే వచ్చారు. మొగం తుడుచుకుంటూ! "ఏంబాబూ యిలా వచ్చావు!" అంటూ సహజ మృదుత్వంతో అడిగారు.

వచ్చేముందు మనసులో ఎన్నో అనుకున్నాడు. తీరా ఎదురు పడేసరికి మాట పెగలడంలేదు. తటపటాస్తూ నీళ్ళునమలటంతప్ప ఏమీ అనలేక పోయాడు...

మామూలుగానే అడగాలి. గుండెల్లో గుబులుకుంటున్న ఆక్రోశం బయటపడకూడదు. కన్నీళ్ళు కనిపించకూడదు. ఇంట్లో ఇంత గొడవ జరిగినట్లు మాష్టారు ఏమాత్రం పసికట్టకూడదు. కొంత కష్టమే అయినా మనసులోలేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకున్నాడు రంగనాథం!

"అబ్బే ఏంలేదు మాష్టారు! నాన్న రెండురూపాయలుంటే యిమ్మన్నాడు!" అన్నాడు. అబద్ధం ఆడుతున్నట్టు కనిపించకుండా మొగం క్రిందికి దించుకున్నాడు.

"దానికేమిటోయ్! ఎందుకంత మొహమాటం మనలోమనకి?" అంటూ రెండ్రూపాయలనోటు చేతిలోపెట్టారు. పెడుతూనే అన్నారు "చాలాబాబూ" అని.

"చాలండి!" అనేశాడు రంగనాథం అనాలోచితంగానే! "థ్యాంక్యూ మాష్టారూ! వస్తా" అంటూ బయల్దేరాడు.

గుండెగుబగుబలాడుతోంది. చేసిన తప్పుదయ్యంలా వెంటాడుతోంది. దైన్యం వెన్నాడుతోంది. అడుగులు తొందరగా పడుతున్నాయి. ఇంటికికాదు రైలుస్టేషనుకి! ఇంకోగంటలో విశాఖవెళ్ళే ఎక్స్ప్రెస్ వుంది. స్టేషన్ మూడు మైళ్ళుంది. నడుస్తున్నాడు రంగనాథం! మనసు నిండాభయం మంచిమేష్టారితో అబద్ధమాడినందుకు పశ్చాత్తాపం! ఏం జరుగుతుందో తెలియని ఆందోళన...

"చాలాబాబూ?" అని అంత ఆప్యాయంగా సూరీడుమాష్టారు అడిగినపుడు మరో రెండు రూపాయలు తీసుకుంటే ఏంపోను? తన్ను తనే తిట్టుకున్నాడు రంగనాథం. ఆమాత్రం సాహసానికే గంగవెర్రులెత్తిపోయాయే? మరింత పెద్దఅబద్ధం ఎలాఆడగలడు? ఆలోచనల వేగంలోదారి తరుగుతోంది. ఆలోచనలు! ఎన్ని పుట్టుకొచ్చినా ఒక్కటీ తన బాధ కడతేర్చేదిగాలేదు.

చెప్పా చెయ్యకుండా ఇల్లు విడిచి బయల్దేరాడేగాని తరువాత కర్తవ్యం ఏమిటో తోచిచావడం లేదు. తీరా అక్కయ్య దగ్గరకు వెడితే 'మీ నాన్నకి చెప్పకుండా ఎందుకు వచ్చావని బావ చీవాట్లు పెడితే!...తాను అనవసర అపవాదు మోయాలని భయపడితే!... "వెళ్ళి చెప్పిరా!...పో" అంటే!

వెళ్ళగానే ఉద్యోగం దొరక్కపోతే? ఎన్నాళ్ళని అక్కాబావా తేరగా తన్ను పోషిస్తారు? అందులోకీ విశాఖపట్నంలో బ్రతుకు గడవడం ఎంతకష్టం! పోనీ తన కంతకన్న గత్యంతరం మాత్రం ఏముంది? బొమ్మని నాన్న కసిరి కొట్టినపుడు - సిగ్గు లేకుండా ఎలాపడి వుంటాడు?

ఆలోచిస్తూ...ఆలోచిస్తూ స్టేషనుకు చేరుకున్నాడు రంగనాథం. యధాలాపంగా బుకింగ్ ఆఫీసు దగ్గరకు వెళ్ళాడు. గంట ఆరు చూపుతోంది. అస్తమించిన సూర్యబింబం కనిపించకపోయినా, ఆకాశం జేవురించి వుంది. ఇంకో పన్నెండు నిమిషాలలో విశాఖవెళ్ళే ప్యాసింజరు రావాలి. ఎక్స్‌ప్రెస్ గంటన్నర లేటు!- బ్లాక్‌బోర్డు సమాచారమందించింది. అటూ ఇటూ పరికించాడు రంగనాథం. ఎరిగిన మొగమొక్కటీ లేదు. టిక్కెట్టు తీసుకొన్నాడు. పదిపైసలూ టికెట్టూ చేతిలో పెడుతూ బుకింగ్‌క్లర్కు ఎందుకో తేరబారి చూశాడు. ఆ చూపు లెందుకో అతడిని భయపెట్టాయి. గబుక్కున చూపులు దింపుకున్నాడు.

ప్లాట్‌ఫాంమీద విశాఖ వైపుగా నడుస్తున్నాడు రంగనాథం. ఒళ్ళంతా పూవుల సువాసనలు పూసుకొని ఠీవిగా నించుంది పున్నాగచెట్టు. గుడ్డల్లేని కుర్రాళ్ళెవరో పున్నాగపూవు లేరుకుంటున్నారు. ఒక డిప్పకాయ వెధవ పూవుకాడ నోట్లో పెట్టుకుని బూరా ఊదుతున్నాడు. ఓ మేక పూవు లేరుకుంటోంది. ఒడేసి నములుతోంది. కళ్ళు పారవశ్యంగా తిప్పుతూ, తన్నే చూస్తోంది.

అలా చూస్తుంటే గాలికి కదిలిన చెట్టు పూలవాసన లందించింది.

వాసన తగిలేసరికి జేబులో నలుగుతున్న సిగరెట్టు జ్ఞాపకం వచ్చింది. తీశాడు. వంకర్లుతిరిగింది. బెంచీబల్లమీద సాపుచేసుకున్నాడు. "ఎంత సుఖంగా ఉందామేక?!" అనిపించింది రంగనాథానికి. వెంటనే మేకనైనా కాకపోతిని" అని బిగ్గరగా పాడాలనిపించింది.

అరటిపళ్ళ వ్యాపారస్తుడి దగ్గరకుపోయి సిగరెట్టుకు నిప్పంటించుకున్నాడు. పొగ దట్టంగా లాగుతూ, అటూ ఇటూ తిరుగుతున్నాడు.

పడమటి ఆకాశంలో రంగులు మారుతున్నాయి. పున్నాగచెట్టు నీలిరంగు మేలిముసుగు వేసుకుని హుందాగా నిలచింది.

ప్రళయ భీకరంగా శబ్దాలు చేసుకుంటూ ప్యాసెంజరు వచ్చింది. ఆగింది. దాదాపు ఎదురుగా ఉన్న మూడో తరగతి బోగీలో కెక్కాడు. అదృష్టవశాత్తూ తను కూర్చుందుకో సీటు లభించింది, గుమ్మంప్రక్కనే ఉన్న సీటు. లెవేటరీ వాసన కొంచెం దుర్భరంగానే వుంది. అయినా కూర్చోడం తప్పలేదు. వేళ్ళు కాలుస్తూంటే సిగరెట్టు విసిరేశాడు. బండి ఈల వేసింది. ఒక్క కుదుపు కుదిపింది. హుషారుగా కదలనారంభించింది.

బోగీలో ఎంతమంది ఉన్నా తాను ఒంటరిగానే ఉన్నాడు. ఒంటరితనం అవమానం కన్న భరింపరాని శాపంలాగుంది. సరే, ఏంచేస్తాడు. తీవ్రంగా ఆలోచించుకుంటున్నాడు. భవిష్యత్తు కనుచూపు మేరలో ఎక్కడా కనిపించడంలేదు. ఏంచేయాలి?.. ఎలా? ఎలా?..

బియ్యే అనిపించుకుంటే ఎంతబాగుండేది? అదే అన్ని ఆలోచనలకీ ముగింపు. అదే వుంటే తన కీపాట్లు ఎందుకు వస్తాయి. అదే చివరి తెరజార్చే విరక్తి!!

స్టేషన్లు ఒకటొక్కటే విడిచిపెడుతోంది రైలు. కడుపులోఆకలి దహించుకు పోతోంది రంగనాథానికి. ఎప్పుడో పదకొండుగంటలకు తిన్న పిండాకూడు. ఏమైపోయిందో తెలియదు. లోకమంతటా చీకటి ఆవరించుకొంటోంది. చెట్లు చీకటి ముద్దల్లా పేరుకుంటున్నాయి. చెట్లమీద కునుకుతున్న పిట్టలు రైలు వేగానికి కలవరపడి లేస్తున్నాయి.

ఏదో స్టేషను వచ్చింది. చాలాసేపాగింది రైలు. తీరా కదలబోతుండగా ఒకస్థూలకాయుడు ప్రవేశించాడు. ఊతకోల సహాయంతో లోపలికి జరిగాడు. నల్లగా శిలావిగ్రహంలాగున్నాడు. ముఖంనిండా మశూచి గుంటలు....కనుపాపలు తెల్లగా నున్నాయి. బలంగా ఎత్తుగా వస్తాదులాగున్నాడు.

రైలు కదిలింది. ఉన్నంతలో వేగం పుంజుకుంటోంది. ఆగంతకుడు గొంతుసవరించుకున్నాడు. "బాబూ! ఏలినవారు! కళ్ళు రెండూ లేని కబోదిని...మీరే తల్లీ తండ్రీ....చుట్టముక్క కాల్చి పారేసినంత బాబూ నా బ్రతుకు!..." అంటూ కర్రచప్పుడు చేసుకుంటూ కదలనారంభించాడు.

ముష్టివాణ్ణి ఆపాదమస్తకం పరికించాడు రంగనాథం. వాడి అకారం నిజంగా భయం కలిగిస్తోంది.

"ఛీ దొంగవెధవలు.. అంతా మోసం" అనుకున్నాడు రంగనాథం. ఇంతకీ వీడు గుడ్డివాడేనా ? పరీక్షించాలన్న తుంటరి బుద్ధి పుట్టింది. ముష్టివాడు తన ముందునుంచి వెడుతున్నాడు. కాలు అడ్డం పెట్టాడు రంగనాథం. వాడి కాళ్ళు మెలికిపడి ముందుకు తూలాడు. పడిపోబోయాడు ముష్టివాడు. ఆపుకొని నిలదొక్కుకున్నాడు.

"బాబూ ! గుడ్డివాణ్ణి నాయనా, కాళ్లు తీసుకోండి బాబులారా" అంటూ దీనంగా ప్రార్థించాడు. చప్పున కాళ్లు ముణగదీసుకున్నాడు రంగనాథం.

"ఆకలి బాబూ ! అన్నదాతలారా !... అన్నపూర్ణ తల్లీ ధర్మం ముష్టివాడు సాగుతున్నాడు. సీటు పొడుగునా ధర్మాత్ములు నయాపైసలు పడేస్తున్నారు. చిట్టచివరి వరకూ వెళ్లి దారి మూసుకుపోవడంతో వెనక్కి మళ్లాడు గుడ్డివాడు. "ఆకలి బాబూ !" అంటూనే ఉన్నాడు.

ఆకలి....అవును, తానెప్పుడో తిన్న మెతుకులు అరాయించు పోయాయి. మధ్యాహ్నం కాఫీ కూడా లేకపోయింది. ఆకలి ంచేస్తోంది. శ్రీకాకుళపట్నం వెళ్లేసరికి పదిదాటు తుందేమో ! తన గ్గర అమాంబాపతూ ఇరవై పైసలే ఉన్నాయి. సిగరెట్టు ముక్క కాడా లేదు. తీరా చేసి సింధియా క్వార్టర్సు వరకూ నడచిపోతే అక్కయ్య తన కోసం వండి వార్చి పెడుతుందా ? దారిలోనే కాస్త ఎంగిలి పడి పోతే !...ఎలా మరి ?

గుడ్డివాడు సమీపించాడు. నిజమే వాడుపూర్తిగాగుడ్డివాడే. తిండిపుష్టి ఉన్నట్టు బలంగానే ఉన్నాడు. తానాకళ్లున్నవాడే తనతా విషయం పూర్తిగా తెలుసు. గుడ్డివాడి కడుపులో ఆకలి ఉందోలేదో తనకు తెలియదు. తన కడుపుమాత్రం ఆకలితో కాలిపోతోంది! కాని ముష్టి వాడికి కళ్ళనిండా గాఢమైన చీకటి ! బ్రతుకంతా చీకటి !

తోటి ప్రయాణీకులు తన్ను గమనించకుండా జాగ్రత్తపడ్డాడు రంగనాథం! "ఆగరా-అబ్బీ!" హుందాగా, తన పదిపైసల బిళ్ళ గుడ్డివాడి చేతిలో పడేశాడు. వాడిచేతిలోని ఏభైపయిసలబిళ్ళ తీసుకున్నాడు. గుడ్డివాడి చేతిలో గుప్పెడు డబ్బులున్నాయి!

బోగీలో కునుకుతున్న దీపాలవెలుతురులో చేతిలో బిళ్ళతెల్లగా మెరుస్తోంది. ఎవరూ చూడకుండా జేబులో భద్రంచేసుకున్నాడు రంగనాథం!

గుడ్డివాడు సాగిపోయాడు!

గుడ్డివాణ్ణి ఆకలి బిచ్చగాణ్ణి చేసింది! మరితన్ని ?

అవునా? ఆకలిమాత్రం అనంతగా ప్రయాణం సాగిస్తోంది ! మనుషుల నైజాలు మార్చేస్తోంది !!!.